నెల తర్వాత అతను ఆ సాధువు దగ్గరకి వచ్చి తన కృతజ్ఞతలని తెలియచేసి ఆశగా అడిగాడు.

" బంగారు గనులు ఈ అడవిలో లేవా స్వామీ?"

"ఎందుకు లేవు? ఇంకాస్త ముందుకి వెళితే బంగారు గనులున్నాయి. నువ్వు మోయగలిగినంత తెచ్చి అమ్ముకుంటే నీ కుటుంబానికి ఏడాదికి సరిపడే ధనం లభిస్తుంది."

ఏడాది తర్వాత అతను సాధువు దగ్గరకి మళ్ళీ వచ్చాడు. అప్పటికే బాగా ముసలివాడైన ఆ సాధువు అతనితో చెప్పాడు.

"నేను ఆట్టే కాలం ఉండను కాబట్టి నీకీ రహస్యం చెప్తున్నాను. నువ్వు ఇంకాస్త ముందుకి వెళితే వజ్రాల గని కనిపిస్తుంది. నువ్వు మోయగలిగినన్ని రాళ్ళు తెచ్చుకుని అమ్ముకుంటే జీవితాంతం నువ్వు, నీ కుటుంబ సభ్యులు హాయిగా జీవించేంత డబ్బు వస్తుంది."

"నాకు ఆశ్చర్యంగా ఉంది. వీటి రహస్యాలని తెలిసిన మీరు వీటిని అనుభవించక ఈ అడవిలో కళ్ళు మూసుకుని కూర్చుని ఏం చేస్తున్నారు?" అడిగాడు అతను.

"నీలా నేనూ వజ్రం కోసమే ప్రయత్నిస్తున్నాను. ఆ వజ్రం దొరికితే ఇంక ప్రపంచంలోని ఏ వజ్రంతో అవసరం ఉండదు." జవాబు చెప్పాడు ఆ సాధువు.

ఆ సాధువు మరణించినా ఆ చెట్టు కింద మరో సాధువు కూర్చుని దైవ ధ్యానం చేయసాగాడు. అతను ఆ కట్టెలు కొట్టే అతనే.

## 18. దుస్తులు

ఓ రాజుగారు అలంకార ప్రియులు. ఆయన ఓ సారి దుస్తుల పోటీని ప్రకటించాడు. దేశంలోని దర్జీ పనివాళ్ళంతా కొత్త రకం దుస్తులని ఉత్సాహంగా కుట్టసాగారు. తాము కనిపెట్టిన విభిన్న దుస్తులు రాజుకి నచ్చితే బహుమతి లభిస్తుందని వారి ఆశ.

దేశంలోని దర్జీలంతా రకరకాల దుస్తులని కుట్టి పోటీ జరిగే రోజు రాజ సభకి హాజరయ్యారు. వారు కుట్టినవన్నీ ఒకదాంతో మరొకటి పోటీ పడేలా అద్భుతంగా వున్నాయి. ఓ ముసలి దర్జీ మాత్రం ఉత్త చేతులతో వచ్చాడు. అతని వంతు రాగానే, ఖాళీ చేతులతో వచ్చిన ఆ దర్జీని చూసి రాజు అడిగాడు.

"పోటీకి వచ్చినట్లున్నావు?"

"అవునండి." వినయంగా జవాబు చెప్పాడు ఆయన.

"మరి దుస్తులని తేలేదే?"

"అవి కంటికి కనపడేవి కావు రాజా! దయ అనే బట్టని, ఇతరుల పట్ల మృదుత్వం అనే దారంతో సహనం అనే గుండీలతో కుట్టిన ఆ దుస్తులని ధరించి సేవ అనే తాడుతో జారి పోకుండా కట్టుకోవాలి. అవే ఏ మనిషికైనా నిజమైన అలంకారాలు."

రాజు ఆ దర్జీ వాడికి ప్రథమ బహుమతిని ఇచ్చాడు.

## 19. సాధుత్వం

ఓ సంచార గురువు చీకటి పడుతూండగా తన శిష్యుడితో ఓ గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ గుళ్ళో విశ్రమిద్దామనుకున్నాడు కాని గుడి అర్చకుడు వాళ్ళని అందుకు అనుమతించలేదు.

"మీరు విగ్రహాలకున్న బంగారు నగలని కాజేసే దొంగల్లా ఉన్నారు." కసురుతూ చెప్పాడు.

వాళ్ళకి ఆ గ్రామంలో ఎవరూ భిక్ష ఇవ్వలేదు.

"మీరిద్దరూ దొంగ సాధువుల్లా ఉన్నారు. తెల్లారాక మా గ్రామం విడిచి వెళ్ళిపోండి." హెచ్చరించారు వాళ్ళు.

మర్నాడు పొద్దున్న వారు ఆ గ్రామం విడిచి వెళుతూండగా ఓ గ్రామస్థుడు ఎదురు పడ్డాడు. వాడు వెంటనే ఆ ఇద్దరి మీదా ఉమ్మేసి కోపంగా అరిచాడు.

"వెధవల్లారా! పొద్దున్నే మీ మొహం చూసాను. ఈ రోజు ఏం కీడు రానున్నదో నాకు."